కల్వర్టు కష్టాలు..

- పనులు పూర్తికాక రాకపోకలకు ఇబ్బందులు
- నిత్యం ట్రాఫిక్ సమస్య.. వాహనదారుల ఇక్కట్లు


లింగంపల్లి- తారానగర్ ప్రధానరోడ్డును మూసివేసిన దృశ్యం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద బాక్స్‌టైప్ కల్వర్టు నిర్మాణ పనుల్లో జాప్యంతో వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. కల్వర్టు పనులతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. పనులు ప్రారంభించి 3 నెలలు కావొస్తున్నా, పనుల్లో జాప్యంతో స్థానికులు, వాహనదారులు అవస్థపడుతున్నారు. పనుల్లో భాగంగా ట్రాఫిక్‌ను కాలనీల్లోకి మళ్ళించారు. ఐతే ఈ కాలనీల్లో కూడా కల్వర్టు, డ్రైన్ పనులు చేపట్టడంతో అటు వెళ్ళిన వాహనదారులు ఎటు వెళ్లాలో తెలియక అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి మూడుచోట్ల కల్వర్టుల పనులు చేపట్టడంతో సమస్య మొదలైంది. అధికారుల మధ్య సమన్వయలోపమే ఇందుకు ప్రధాన కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు.కాగా వర్షాకాలంలో లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తరచూ వరదనీరు నిలిచి రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. భెల్ చౌరస్తా నుంచి తారానగర్ మీదుగా ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హెచ్‌సీయూ, ఐఎస్‌బీ, ట్రిపుల్ ఐటీ, ఉర్దూ విశ్వవిద్యాలయం, ఔటర్ రింగురోడ్డు వంటి ప్రాంతాలకు ఈ రోడ్డు ద్వారానే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బాక్స్ టైప్ డ్రైన్ నిర్మాణానికి గత ఏడాది ఆగస్టు 28వ తేదీ శంకుస్థాపన చేశారు. పనుల్లో వేగం పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

కాలనీల్లో కూడా కల్వర్టు పనులు

- లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద బాక్స్ టైప్ డ్రైన్ పనులతో వెంకట్‌రెడ్డి కాలనీ మీదుగా తారానగర్ వెళ్లొచ్చు. అదే విధంగా తారానగర్ మసీదు రోడ్డు కూడా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో రోడ్డు వెడల్పు 10 నుంచి 15 అడుగుల మేర ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.
- తారానగర్ తుల్జాభవానీ ఆలయం సమీపంలో కల్వర్టు నిర్మాణంతో ట్రాఫిక్‌ను మళ్ళించారు.
- తారానగర్ సాయిబాబా ఆలయం రోడ్డులోనూ బాక్స్‌టైప్ డ్రైన్ నిర్మాణంతో ఆ రోడ్డును మూసి వేశారు.
- దీంతో ఈ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.
- ఒకేసారి మూడుచోట్ల పనులు సాగుతుండడంతో రాకపోకలు సాగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు,
- దీంతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు చేస్తున్నారు.
- నల్లగండ్ల ఫ్లైఓవర్ మీదుగా లింగంపల్లి వెళ్లేందుకు దూరమైనా గత్యంతరం లేక రాకపోకలు చేస్తున్నారు.


తారానగర్ తుల్జాభవానీ ఆలయం సమీపంలో కల్వర్టు నిర్మాణ పనులతో రోడ్డు క్లోజ్


తారానగర్ సాయిబాబా ఆలయం వద్ద జరుగుతున్న బాక్స్‌టైప్ డ్రైన్ పనులు

కల్వర్టు పనులు వెంటనే పూర్తి చేయాలి



తారానగర్ ప్రధాన రోడ్డులో నిర్మిస్తున్న బాక్స్‌టైప్ కల్వర్టు పనులు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలి. లింగంపల్లి ప్రాంతానికి ఎక్కువ ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి, వాహనదారులు, స్థానికులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలి.

–తాడిబోయిన రామస్వామియాదవ్, మాజీ కౌన్సిలర్

పోచమ్మ ఆలయానికి లక్ష విరాళం



రాయదుర్గం: నానక్‌రాంగూడలోని పోచమ్మ ఆలయ అభివృద్ధికి స్థానిక నాయకుడు మేకల సురేందర్ ముదిరాజ్ లక్ష రూపాయలు విరాళంను ఆలయ ప్రతినిధులకు ఆదివారం అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రమేష్‌గౌడ్, నారాయణ, కృష్ణారెడ్డి, నరేష్‌సింగ్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలోని 261 సర్వేనంబర్‌లో గల అసైన్డ్ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఆదివారం రెవెన్యూ అధికారులు కూల్చివేయించారు. తహసీల్దార్ గంగాభవాని ఆదేశాల మేరకు ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి జేసీబీలతో కూల్చివేయించారు. అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్ఐ హెచ్చరించారు.

వైభవంగా సీతారాముల ఊరేగింపు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి లక్ష్మీవిహార్ ఫేజ్–2 కాలనీలో ఆదివారం సీతారామస్వామిని ఊరేగించారు. అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా కాలనీ అధ్యక్షులు రవీంద్రప్రసాద్ దూబే ఆధ్వర్యంలో మేళ తాళాలతో ఊరేగించి ఇంటింటికి అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు నర్సింహారావు, కార్యదర్శులు సరిత, మాధవి, సత్యనారాయణరాజు, విద్యాసాగర్‌లతో పాటు కాలనీవాసులు రామమూర్తి, కరుణాకర్, గురు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్



గచ్చిబౌలి: అయోధ్యకు శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతి యాదవ్ వెళ్లారు. బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవానికి ట్రస్ట్ నుంచి ఆహ్వానం అందడంతో బయలుదేరారు. శ్రీరామ జన్మభూమిని సందర్శించడం పూర్వ జన్మసుకృతమని భిక్షపతి పేర్కొన్నారు.

హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ షురూ



గచ్చిబౌలి: యువ గోల్ఫర్లను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తోన్న హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ నాలుగో సీజన్ ప్రారంభమైంది. వికారాబాద్‌లోని వూటీ గోల్ఫ్ కౌంటీ వేదికగా జరిగిన తొలిరోజు పోటీల్లో మీనాక్షి మావెరిక్స్ టాప్ ప్లేస్‌లో నిలిచింది. మొత్తం 16 జట్లు 4 గ్రూపులుగా పోటీ పడుతున్నాయి. గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నాకౌట్ స్టేజ్ కు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీ మెగా ఫైనల్స్ బ్యాంకాంక్‌లోని అతిపెద్ద గోల్ఫ్ కోర్సులో నిర్వహిస్తున్నట్లు లీగ్ కమిషనర్ సుమంత్ డిఎస్ చెప్పారు. ప్రతీ సీజన్‌లో గోల్ఫర్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తుండడంతో హోరాహోరీగా సాగుతోందన్నారు. యువ గోల్ఫర్లకు హెచ్ పీజీఎల్ మంచి వేదికగా అభివర్ణించారు. గ్రూప్ డిలో మీనాక్షి మావెరిక్స్ టీమ్ 210 పాయింట్లతో టాప్ ప్లేస్‌లో నిలిచింది.


సోలక్‌పల్లిలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

అభివృద్ధి పనులు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సూచించారు. ఆదివారం జిన్నారం మండలంలోని అండూర్, సోలక్‌పల్లి, ఊట్ల, జిన్నారం, మాదారం, గడ్డపోతారం గ్రామాల్లో 2.35 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందేలా కృషి చేస్తానన్నారు .కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

ఆల్విన్‌కాలనీ: గౌడ సంఘం భవన నిర్మాణానికి బీఆర్‌యస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాచర్ల భద్రయ్య పదివేల రూపాయలను గౌడ సంఘం అధ్యక్షులు జంగయ్య గౌడ్‌కు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొప్పు వెంకటేశ్వర్ గౌడ్, యాదయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

ఓటర్ స్పెషల్ డ్రైవ్.. 8 దరఖాస్తులు


నమోదు కార్యక్రమంలో బీఎల్‌ఓలు

మూసాపేట: ఓటర్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మూసాపేటలోని ప్రభుత్వ పాఠశాలలోని 178, 179, 180,181,186 బూత్‌లలో కొత్త ఓటరు నమోదు, పేర్లు, చిరునామా మార్పు చేర్పుల కొరకు మొత్తం 8 మంది దరఖాస్తు చేస్తున్నారు. శనివారం కేవలం ఒక్కరు మాత్రమే ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారని అధికారులు తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌పై ప్రచారం చేయలేదని స్థానికులు అంటున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మియాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 19వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో మియాపూర్ మెట్రో స్టేషన్ డిపోలో ఓ వ్యక్తి కిందపడి ఉన్నాడని స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించగా ఆ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడు. అతనిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడ నుండి మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అతని వయస్సు సుమారు 39 సంవత్సరాలు ఉంటుందని, బ్లూ కలర్ షర్ట్, బ్లాక్ కలర్ ఫ్యాంట్, బ్లాక్ కలర్ జాకెట్ ధరించి ఉన్నాడని తెలిపారు.



నూతన కార్యవర్గం

శేరిలింగంపల్లి: డివిజన్ పరిధిలోని శ్రీరాం ప్రసాద్ దూబే కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కాలనీలోని హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షులుగా కె.అనిల్‌కుమార్ ముదిరాజ్, అధ్యక్షులుగా చిట్టా రెడ్డి ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, ఉపాధ్యక్షులుగా రాయల ప్రవీణ్‌కుమార్, మల్లికార్జునచారీ, పిల్లి యాదగిరి, బ్రహ్మానందం, ముఖ్య సలహాదారులుగా శైలేష్ తివారీ, రూపేష్ దూబే, పోచయ్య, లీగల్ అడ్వైజర్‌గా రాజ్ కిరణ్ దూబే, జగదీష్, జాయింట్ సెక్రటరీగా పి.కృష్ణ, ఆడిటర్‌గా అఫ్సర్, హనుమాన్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


ఓంకార్‌నగర్ బస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

మియాపూర్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఓంకార్‌నగర్ బస్తీలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా బస్తీలో నివాసముంటున్నా కనీస వసతులకు కూడా నోచుకోలేకపోవడం తగదన్నారు. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి బస్తీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వీరేందర్‌గౌడ్, కృష్ణముదిరాజ్, మన్నెపల్లి సాంబశివరావు, తిరుపతి, రవికుమార్, గిరి తదితరులున్నారు.

బస్తీ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆల్విన్‌కాలనీ: ప్రజా పాలనకు నిదర్శనంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని, శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. ఆదివారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపారాయుడునగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డినగర్, హనుమాన్‌నగర్, ప్రగతినగర్, దీనబంధు కాలనీల్లో నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి జగదీశ్వర్‌గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పద్మశాలీల సంక్షేమానికి పెద్ద పీట

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గ పరిధిలోని పద్మశాలి కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం భెల్ అధికార కార్మిక సంఘం కార్యాలయ ప్రాంగణంలో భెల్ పద్మశాలి సంక్షేమ సంఘం శాఖ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... చేనేత రంగానికి పెద్ద పీట వేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చెందుతుందని అన్నారు. నియోజకవర్గంలోని పద్మశాలీ కులస్తుల అభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో పద్మశాలి కులస్తుల సహకారం మరువలేనిదని అన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు, వివాహ పరిచయ వేదిక వంటి కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ విభాగాల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధు ఆదర్శ్‌రెడ్డి, పుష్ప నగేష్, రాగం నాగేందర్ పాల్గొన్నారు.

ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రామ్ అభినందనీయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సత్యవాణి

నిజాంపేట్: లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆఫ్టర్ స్కూల్ ప్రోగామ్‌ను నిర్వహించడం అభినందనీయమని నిజాంపేట్ 6వ డివిజన్ కార్పొరేటర్ సత్యవాణి అన్నారు. ఆదివారం డాక్టర్ తోలేటి బుల్లి సోమేశ్వరరావు సౌజన్యంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు స్థానిక అంగన్వాడి స్కూల్‌లో ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే వారికి ఉచితంగా ట్యూషన్ చెప్పడంతో పాటు వారిలో సాఫ్ట్ స్కిల్స్‌ను మెరుగుపరిచేందుకు ఈ ప్రోగ్రామ్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.వచ్చే సంవత్సరం ప్రగతినగర్‌లో మరో మూడు సెంటర్లను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటరామయ్య, వసుధ, బాలాజీ, మాజీ వార్డు సభ్యుడు రతన్‌రాజు, ట్రస్టీ రాజకుమారి, రిటైర్డ్ ఎంఈఓ సంతోష్ కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తిరుమల మహా పాదయాత్ర ప్రారంభం



కూకట్‌పల్లి: తిరుమల మహా పాదయాత్ర కేపీహెచ్‌బీ కాలనీ నుంచి ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శక్తివాహిని ఫౌండర్ మౌనిక సుంకర, డాక్టర్ రామ్‌సింగ్, యాంజాల పద్మయ్య, బాలకృష్ణ గురుస్వామి, డాక్టర్ రాకేష్, భీమ్‌రెడ్డిలు పాల్గొన్నారు. లక్ష్య సాధన ఫౌండేషన్, ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో కార్యక్రమంను నిర్వహించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్


సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ ఫేజ్ టు, గాంధీనగర్ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, వైర్లతో ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ ఆదివారం కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు చిన్నోళ్ల శ్రీనివాస్, రామస్వామి, షకీల్ మున్నా, సలీమ్, భిక్షపతి, మోజస్, మధులత, నస్రీన్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో యువత భాగస్వాములవ్వాలి


విద్యార్థినికి పట్టా అందిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ నరేష్ తదితరులు

కూకట్‌పల్లి: దేశ ఆర్థికాభివృద్ధిలో యువత భాగస్వాములవ్వాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు పి. విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కూకట్‌పల్లి వివేకానంద డిగ్రీ కళాశాలలో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం భారతదేశం అని, రాబోయే రెండు సంవత్సరాల్లో భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఐదోస్థానం నుంచి మూడోస్థానానికి రాబోతున్నదని తెలిపారు. కళాశాల చైర్మన్ డాక్టర్ నరేష్ మాట్లాడుతూ డిగ్రీలో ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందిస్తూ ఎంప్లాయిమెంట్ క్రియేటర్స్‌గా ఉండాలని, అప్పుడే సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదుగుదామని తెలిపారు. మంచి నడవడికతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ కేవీ లావణ్య, డి.మౌనిక, ప్రిన్సిపాల్ బిఎస్ రాజేష్, వనిత డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపల్ రాజయ్య, సంఘమిత్ర డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా చిత్తారమ్మ జాతర


శివసత్తుల నృత్యాలు

సుభాష్‌నగర్: పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకం, డప్పు చప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపుతో గాజులరామారం చిత్తారమ్మ జాతర ఘనంగా జరిగింది. ఆదివారం గాజులరామారంలో జరిగిన చిత్తారమ్మ దేవి ప్రధాన జాతరకు భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసర ప్రాంతాల నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి సుమారు మూడు లక్షల మంది ప్రజలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారి ఆలయానికి ఇరువైపులా కిలోమీటర్ మేర భక్తుల క్యూలైన్ కనిపించింది. సంప్రదాయ దుస్తులు ధరించి కుటుంబ సమేతంగా అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు. సాయంత్రం గాజులరామారం గ్రామం నుంచి అమ్మవారి రథం ఊరేగింపు కనులపండువగా సాగింది. జాతరకు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలను హనుమంత్‌రెడ్డి, బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా బాలానగర్ డీసీపీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.





అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం భారతీయ కళాక్షేత్రం శిష్యబృందం కర్ణాటక సంగీత కచేరీ, కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు.



వ్యక్తి అదృశ్యం



మాదాపూర్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కి చెందిన నందకిషోర్(30) నగరానికి వచ్చి మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీ ఫ్లాట్ నంబర్ 229లో తన అన్నతో కలసి తాపీమేస్త్రీ పనిచేస్తున్నాడు. ఈనెల 14వ తేదీన బయటికి వెళ్ళిన అతను తిరిగిరాకపోవడంతో అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఎత్తు 4.8, తెల్ల చొక్క, లైట్ కలర్ ఫ్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిస్తే ఫోన్ నంబర్ 8712566984లలో సంప్రదించాలన్నారు.